క్లుప్తంగా

విద్యార్థులు క్రీడల్లో రాణించాలి



గుమ్ములూరులో విద్యార్థులతో మాట్లాడుతున్న ఎంఈఓ కుశలవదొర

మధురపూడి: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని ఎంఈఓ టి.కుశలవదొర అన్నారు. శుక్రవారం కోరుకొండ మండలం గుమ్ములూరులోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్కూల్ భవనాన్ని, రికార్డులను పరిశీలించారు. కొద్దిసేపు విద్యార్థులతో మమేకమయ్యారు. పాఠ్య, నోట్ పుస్తకాలు, షూ అందిందా లేదా అనే విషయాలు ఆరా తీశారు. అలాగే డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం అమలు తీరును విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. తల్లిదండ్రుల కలను నెరవేర్చేందుకు శ్రమించాలని వారికి సూచించారు. ఉపాధ్యాయుల బోధనపై ఆరా తీశారు. పాఠశాల హెచ్ఎం గంగాభవాని తదితరులు పాల్గొన్నారు.

విజయదుర్గమ్మకు పంచామృతాభిషేకాలు



సంపరలో విజయదుర్గమ్మ



రంగంపేటలో విజయ దుర్గాంబిక అమ్మవారు

పెదపూడి: సంపర గ్రామంలో ప్రసిద్ధి చెందిన విజయదుర్గమ్మ ఆలయంలో అమ్మవారికి శుక్రవారం పంచామృతాభిషేకాలు నిర్వహించారు. ఆలయ అర్చకుడు ఖండవిల్లి హనుమంతాచార్యులు ఆధ్వర్యంలో అమ్మవారికి ఉదయం విశేష పూజలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని సామూహిక కుంకుమ పూజల్లో పాల్గొన్నారు.

దుర్గాంబిక ఆలయంలో..

రంగంపేట: స్థానిక మంచినీటి చెరువు వద్ద కొలువైన విజయ దుర్గాంబిక ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకుడు నారాయణశర్మ తెల్లవారు జామునే అమ్మవారిని సర్వాంగ సుందరంగా అలంకరించారు. అనంతరం భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు.

బాలిక అదృశ్యంపై కేసు

రంగంపేట: బాలిక అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లు స్థానిక ఎస్‌ఐ తోట కృష్ణసాయి తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. రాజమహేంద్రవరం సింహాచలనగర్‌కు చెందిన బాలిక (16) గురువారం ఉదయం తన అమ్మమ్మ ఇల్లు రంగంపేట మండలం కోటపాడు గ్రామం వచ్చి, అదే రోజు మధ్యాహ్నం తన ఇంటికి వెళుతూ అదృశ్యమైంది. దీనిపై ఆమె తల్లి గుడబండి కుమారి శుక్రవారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు. ఎవరికైనా ఆచూకీ తెలిస్తే రంగంపేట పోలీస్ స్టేషన్‌లో గాని, 94409 04854 నంబర్‌కు సమాచారం అందించాలన్నారు.

పట్టభద్రులు ఓటు నమోదు చేసుకోవాలి

రంగంపేట: మండలంలోని పట్టభద్రులంతా ఓటు నమోదు చేయించుకోవాలని అసిస్టెంట్ ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారి, రంగంపేట తహసీల్దార్ యు.రంజిత్‌కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2024 నవంబర్ 1 నాటికి డిగ్రీ ఉత్తీర్ణులై మూడేళ్లు పూర్తయిన వారికి, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓట్లు నమోదు కోసం వచ్చే నెల 6 లోగా మండల విద్యాశాఖ అధికారి, ఎంపీడీఓ, తహసీల్దార్ కార్యాలయాల్లో గాని దరఖాస్తు చేసుకోవాలన్నారు. దరఖాస్తుతో పాటు కలర్ ఫోటో, ఆధార్‌కార్డు, ఓటర్ ఐడీ కార్డు, 10వ తరగతి, ఇంటర్, డిగ్రీ సర్టిఫికెట్లు అందించాలన్నారు.

వ్యవసాయ క్షేత్రాల సందర్శన



క్షేత్ర సందర్శనలో విద్యార్థులు

మధురపూడి: కోరుకొండ మండలం శ్రీరంగపట్నంలో వ్యవసాయ క్షేత్రాలను బీఎస్సీ అగ్రికల్చర్ విద్యార్థులు శుక్రవారం సందర్శించారు. శ్రీకాకుళం జిల్లా నైరాలోని కళాశాలలో చదువుతున్న లీలా ప్రసాద్, బి.సాయి, కె.పవన్‌కుమార్, పి.మోహన్ కృష్ణతేజ, బి.తరుణ్‌లు శ్రీరంగపట్నంలో పొలాలను సందర్శించారు. పొలాల్లో తెగుళ్లను గుర్తించారు. ఈ సందర్భంగా రైతులతో మాట్లాడారు. సాగులో వారు అవలంబిస్తున్న విధానాలను తెలుసుకున్నారు. వరికి బ్యాక్టీరియా, ఎండు తెగులు సోకినట్టు విద్యార్థులు గుర్తించారు. తెగుళ్ల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను రైతులకు వివరించారు. విద్యార్థి లీలా ప్రసాద్ మాట్లాడుతూ బ్యాక్టీరియా తెగులుతో ఆకులు ఎండిపోవడాన్ని గుర్తించినట్టు తెలిపారు. ఎండాకు తెగులు 5 శాతం కంటే ఎక్కువ ఉంటే నత్రజనిని వేయడం ద్వారా తాత్కాలికంగా అడ్డుకోవచ్చన్నారు. రాజమహేంద్రవరం ఏరువాక కేంద్రం నుంచి వీరు వచ్చారు.

కోతి చేష్టలు.. కష్టాలు కోకొల్లలు

- ఇళ్లు పీకి పందిరేస్తున్న వానర మూకలు
- తోటలు నరకడంతో వచ్చిన తిప్పలు
- బెంబేలెత్తుతున్న జనం



రాజానగరంలో ఇళ్ల మధ్య సంచరిస్తున్న కోతులు



రాజానగరం: కోతులు.. ఇల్లు పీకి పందిరేస్తున్నాయి. చేతికందిన వస్తువులను తీసుకుపోతున్నాయి.. ఆహార పదార్థాలను తినేస్తున్నాయంటూ ప్రస్తుతం గ్రామాల్లో ప్రజలు చెబుతున్న మాటలివీ. రియల్ ఎస్టేట్ ప్రభావంతో పంట భూములు, పండ్ల తోటలు తరిగిపోతున్నాయి. దీంతో ఆయా తోటలపై ఆధారపడి జీవించే వానరాలు తమ ఆకలి తిప్పికలను తీర్చుకునేందుకు ఇళ్లపై దాడులు చేస్తూ జనాన్ని హడలెత్తిస్తున్నాయి. కోతి చేష్టలు అంటే ఎలా ఉంటాయో జనానికి రుచి చూపిస్తూ, చేతికి దొరికిన వస్తువులను ఎగరేసుకుపోతున్నాయి. సాధారణంగా హిందువులకు వానరాలంటే శ్రీరాముని బంటుగా భావిస్తుంటారు. అయినా గాని ఇళ్లలోకి చొరబడి ఆహార పదార్థాలను ఎత్తుకుపోవడమే కాకుండా ఉప్పు నుంచి పప్పు వరకూ, బియ్యం వంటి వాటిని కూడా తీసుకుపోతుండడంతో వాటి చేష్టలను భరించలేకపోతున్నారు.

ఇక్కడే ఎక్కువ ఎందుకంటే..

వానరాల బెడద మెట్ట ప్రాంతంలో దాదాపు ప్రతి గ్రామంలో ఉన్నా జాతీయ రహదారిని ఆనుకుని రాజానగరంతోపాటు దివాన్‌చెరువు, లాలాచెరువు హెచ్‌బీ కాలనీ, పాలచర్ల, శ్రీరామపురంలలో మరీ విపరీతంగా ఉంది. ఇతర గ్రామాల్లో ఉన్న వానరాలను ఆయా పంచాయతీలు పట్టించి, జాతీయ రహదారిని ఆనుకుని ఉన్న ఆ గ్రామాల్లో రాత్రి సమయాల్లో వదిలేస్తున్నారు. దీంతో ఇక్కడ పంచాయతీ సిబ్బంది జనం పోరు పడలేక అడపాదడపా వానరాలను పట్టించి, దూరంగా వదిలేస్తున్నా, ఏవిధమైన ప్రయోజనం ఉండటం లేదు.

తోటలు తగ్గిపోవడం వల్లే..

సుమారు రెండు దశాబ్దాల కిందటి వరకూ గ్రామీణ ప్రాంతాల్లో వానరాల బెడద ఎక్కువగా ఉండేది కాదు. ఎందుకంటే ఆ సమయంలో రియల్ ఎస్టేట్ ప్రభావం పెద్దగా లేకపోవడంతో పండ్ల తోటలతోపాటు అపరాల సాగు ఎక్కువగా జరుగుతుండేది. మామిడి, జీడిమామిడి, సపోటా, బత్తాయి, జామ, సీతాఫలం, దానిమ్మ ఇలా అనేక రకాల పండ్ల తోటలు విస్తరంగా ఉండేవి. ఈ పంటలపై అనుకూలమైన సమయాల్లో దాడి చేసి, తమ ఆహారాన్ని ఆ వానరాలు సంపాదించుకునేవి. కానీ స్పీడ్ యుగంలో పెరుగుతున్న సాంకేతిక అభివృద్ధితో రియల్ ఎస్టేట్ వ్యాపారం జోరుగా ఉండడంతో పండ్ల తోటలు, సాగు భూములూ కనుమరుగు అవుతున్నాయి. ఈ తరుణంలో వానరాలకు ఆహారం దొరకక జనావాసాలపై పడి ఆహారాన్ని వెతుక్కుంటున్నాయి. చాలా గ్రామాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న వానరాల బెడదను నివారించాలంటే వాటిని పట్టించి, అడవుల్లో వదిలేయాలని పలువురు సూచిస్తున్నారు. కానీ ఆ విధంగా శ్రద్ధ తీసుకునే అధికారులే కానరావడం లేదు. జనం బాధ పడలేక, కొంతమంది పెద్దల మాటలను కాదనలేక గ్రామ పంచాయతీ అధికారులు వానరాలను పట్టించే ప్రయత్నం చేస్తున్నా, దానిలో చిత్తశుద్ధి లేక అరకొరగానే సాగుతోంది. దీంతో సమస్య యథాతథంగా ఉంటోంది.

ఇళ్లలోకి చొరబడుతూ..



ఏమాత్రం ఏమరపాటుగా ఉన్నా వానరాలు దండుగా ఇళ్లలోకి చొరబడుతున్నాయి. ఇందులో పెద్ద వానరాలుంటే ఇక జనాన్ని హడలెత్తిస్తున్నాయి. ఒక్కోసారి కొట్టబోతుంటే మీదకు దుమికి రక్కేస్తున్నాయి. టపాసులు పేల్చినా ఏమాత్రం భయపడటం లేదు. ఆహార పదార్థాలు, తినుబండారాలను పాడుచేస్తున్నాయి.

– తుమ్మలపల్లి సుజాత, రాజానగరం

ఎన్నిసార్లు పట్టించినా..



ఇప్పటికి నాలుగైదు సార్లు కోతులను పట్టించి, దూరంగా వదిలేసేలా చర్యలు చేపట్టాం. అయినా పదేపదే వస్తున్నాయి. వాటి సంఖ్య ఏమాత్రం తగ్గలేదు. వాటిని పట్టుకునేందుకు బోన్లు పెడుతుంటే ఆ సమయంలో ఒక్కటి కూడా కనిపించడం లేదు. ఆ తరువాత అదే మళ్లీ ఇళ్లలోకి వస్తున్నాయంటూ ఫిర్యాదు చేస్తున్నారు.

– మేకా ప్రసాద్, పంచాయతీ కార్యదర్శి, పాలచర్ల

కోడి పందేలపై పోలీసుల దాడి



ముకుందవరంలో కోడి పందేల నిర్వహణ

రంగంపేట: కోడి పందేలపై దాడి చేసి 28 మందిని అదుపులోకి తీసుకున్నట్లు అనపర్తి సీఐ వి.సంపత్ తెలిపారు. శుక్రవారం ఆయన కథనం ప్రకారం.. రంగంపేట మండలం ముకుందవరం గ్రామ శివారు జీడిమామిడి తోటలో రహస్యంగా కోడి పందేలు నిర్వహిస్తున్నట్లు తమకు సమాచారం అందడంతో దాడి చేశామన్నారు. రాజానగరం, జగ్గంపేట, గండేపల్లి, కిర్లంపూడి మండలాలకు చెందిన 28 మంది విందు ఏర్పాటు చేసుకుని, అనంతరం కోడి పందేలు నిర్వహించారని తెలిపారు. వారిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశామన్నారు. రెండు కార్లు, నాలుగు బైక్‌లు, 18 కోళ్లు, రూ.2.15 లక్షలు స్వాధీనం చేసుకున్నామన్నారు. ఈ దాడిలో అనపర్తి ఎస్‌ఐ ఎల్.శ్రీనునాయక్ పాల్గొన్నారు.

సీసీ కెమెరాల చోరీపై ఫిర్యాదు

బిక్కవోలు: కొమరిపాలెం గ్రామానికి చెందిన శ్రీవసుధా ఎవెన్యూస్ లేఅవుట్‌కు ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు దొంగలించారని, లేఅవుట్‌లోని రోడ్డు ధ్వంసం చేయడానికి ప్రయత్నించారనే ఫిర్యాదుపై బిక్కవోలు ఎస్సై వాసంశెట్టి రవిచంద్రకుమార్ కేసు నమోదు చేశారు. కొమరిపాలేనికి చెందిన పడాల వెంకటరామారెడ్డి, నేకూరి సత్యనారాయణ, ఆడబాల వీరబాబు, ఎ.సూరిబాబు, సున్నా సూరిబాబు, శ్రీనులు ఈ పని చేశారని కొమరిపాలెం గ్రామానికి చెందిన లేఅవుట్ భాగస్వామి కొవ్వూరి వెంకటరెడ్డి ఫిర్యాదు చేశారన్నారు.

మహిళలను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దాలి



సీతానగరం మహిళా శక్తి భవనంలో మాట్లాడుతున్న ఎస్ఐడీబీఐ ఆర్పీఓ శ్రీనివాస్

సీతానగరం: మహిళలను పారిశ్రామిక వేత్తలుగా తీర్చిదిద్దాలనే ఉద్దేశంతో శిక్షణా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని స్మాల్ ఇండస్ట్రీస్ డెవలప్‌మెంట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రీజినల్ ప్రాజెక్ట్ ఆఫీసర్ శ్రీనివాస్ తెలిపారు. శుక్రవారం సీతానగరం మండల మహిళా సమాఖ్య స్త్రీశక్తి భవనంలో జిల్లా కలెక్టర్, డీఆర్‌డీఏ, సెర్ప్ పీడీ ఆదేశాల మేరకు శిక్షణ కార్యక్రమాన్ని ఎస్ఐడీబీఐ ఆర్పీఓ శ్రీనివాస్, లబ్ధీ హండ్, డీఆర్‌డీఏ సెర్ప్ డిస్ట్రిక్ట్ ప్రాజెక్ట్ మేనేజర్ హేమంత్ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలానికి 230 మందికి రుణాలు ఇప్పించి జీవనోపాధి కల్పించాలన్నారు. అందుకు గాను మండల ఏపీఎం, సీసీ, వీఓఏలకు శిక్షణ ఇచ్చామన్నారు. జిల్లాలో 4,130 మందికి లక్ష్యంగా నిర్ణయించామన్నారు. రూ.లక్ష నుంచి రూ.10 లక్షల వరకూ రుణాలు ఇచ్చేందుకు ప్రభుత్వం ముందుకు వచ్చిందన్నారు. ఇందులో ముద్ర, పీఎంఎఫ్ఎంఈ, పీఎంఈజీపీ, విశ్వకర్మ వంటి ద్వారా రుణాలు అందుబాటులో ఉన్నాయన్నారు. స్కీమ్‌ను బట్టి 35 శాతం రాయితీ ఉంటుందన్నారు. జిల్లాలో 18 మండలాల్లో ఈ నెల 26వ తేదీకి శిక్షణ పూర్తి చేయాలన్నారు. మండలానికి ఇచ్చిన టార్గెట్ డిసెంబర్ నాటికి పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో ఏపీఎం జిలానీ, కమ్యూనిటీ కో ఆర్డినేటర్లు హరిబాబు, వెంకటలక్ష్మి, లక్ష్మి, అక్కౌంటెంట్ జయరాజ్, డీఆర్పీ మాధవి తదితరులు పాల్గొన్నారు

గ్రామాలను శుభ్రంగా ఉంచాలి

పెదపూడి: గ్రామాలను శుభ్రంగా ఉంచుకోవాలని ఈఓపీఆర్డీ ఎం.సత్యనారాయణరెడ్డి అన్నారు. పెద్దాడ, పెదపూడి గ్రామాల్లో పారిశుధ్య పనులను శుక్రవారం ఆయన పరిశీలించారు. ఆరోగ్యవంతమైన గ్రామాల నిర్మాణానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని ఈఓపీఆర్డీ అన్నారు. గ్రామాల్లో అవసరమైన ప్రాంతాల్లో బ్లీచింగ్ చల్లించి దోమల నివారణకు ఎబేట్ మందు పిచికారీ చేయాలన్నారు. ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించాలన్నారు. వర్షాలకు పారిశుధ్య సమస్య నెలకొంటుందన్నారు. అధికారులు ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండి పారిశుధ్య పనులు చేపట్టాలన్నారు. రోజూ ప్రజలకు తాగునీటిని క్లోరినేషన్ చేసి సరఫరా చేయాలన్నారు.

ఘనంగా అన్నసమారాధన

సీతానగరం: రఘుదేవపురం కోట దుర్గమ్మ వారి ఆలయం వద్ద శుక్రవారం అన్నసమారాధన నిర్వహించారు. తొలుత అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో గ్రామస్తుల సహకారంతో అన్న సమారాధన జరిగింది.

అడ్రస్ లేని సూపర్ సిక్స్ పథకాలు



రాజానగరంలో పార్టీ కార్యాలయం వద్ద మీడియాతో మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ నాయకులు

వైఎస్సార్ సీపీ నాయకుల ధ్వజం

రాజానగరం: అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తామంటూ ఎన్నికల సమయంలో ఊదరగొట్టిన కూటమి ప్రభుత్వం ఇప్పుడు ఆ హామీలను విస్మరించిందని మండల వైఎస్సార్ సీపీ నాయకులు నిలదీశారు. సూపర్ సిక్స్ పథకాల కోసం ప్రజలు ఎదురుచూస్తుంటే.. కొత్తగా బీరును మార్కెట్‌లోకి తీసుకు వచ్చారన్నారు. స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో మండల కన్వీనర్ దూలం పెద్ద అధ్యక్షతన శుక్రవారం మీడియా సమావేశం జరిగింది. జెడ్పీటీసీ సభ్యుడు వాసంశెట్టి పెదవెంకన్న, మాజీ కన్వీనర్ మండారపు వీర్రాజు, కో కన్వీనర్ గండి నానిబాబు, సర్పంచ్‌లు కుందేటి ప్రసాద్, కోలపాటి వెంకన్న, నాయకులు గంగిశెట్టి సోమేశ్వరావు, అడబాల చినబాబు, నాళం రోశయ్య, దుర్గారావు తదితరులు తమదైన బాణీలో కూటమి ప్రభుత్వ పాలనలో జరుగుతున్న తప్పులను ఎండగట్టారు. అధికారంలోకి వచ్చి వంద రోజులు పూర్తయిన సందర్భంగా గ్రామాల్లో ప్రజల సొమ్ముతో పాలకులు 'పల్లె పండుగ'లు చేసుకున్నారన్నారు. గ్రామ ప్రథమ పౌరుడైన సర్పంచ్‌ని ఆహ్వానించకుండానే అభివృద్ధి పనులకు కూటమి నాయకులు కొబ్బరికాయలు కొట్టడం విచారకరమన్నారు. నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా గెలుపొందిన వ్యక్తి ప్రమాణ స్వీకారం కూడా చేయకుండానే దోపిడీకి తెరలేపారని వైఎస్సార్ సీపీ నాయకులు విమర్శించారు. గత ప్రభుత్వంలో ప్రజల కోసం ముందు జాగ్రత్త చర్యగా వేసిన ఇసుక గుట్టలను గుట్టుచప్పుడు లేకుండా తరలించారని ఆరోపించారు. ఇదే పరిస్థితి రాష్ట్రమంతటా అమలు చేస్తుండటంతో జనమంతా విస్తుపోతున్నారన్నారు. దోచుకోవడం, దాచుకోవడమే అజెండాగా ఉన్న కూటమి పాలకులు ప్రజా సంక్షేమాన్ని కూడా విస్మరించారని విమర్శించారు. జగనన్న ప్రభుత్వంలో రికార్డు స్థాయిలో 32 లక్షల మంది పేదలకు ఇళ్ల పట్టాలు అందజేస్తే, ఈ కూటమి ప్రభుత్వంలో ఆయా స్థలాల్లో ఇల్లు కట్టుకునే వారికి అవసరమైన మౌలిక సదుపాయాలను కూడా కల్పించలేకపోతుందన్నారు. ఇక నియోజకవర్గంలో పరిస్థితులు మరీ అధ్వానంగా ఉన్నాయన్నారు. ఇంటింటికీ గోదావరి జలాలను అందించాలనే సంకల్పంతో మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా గత ప్రభుత్వంలో రూ. 215 కోట్లతో చేపట్టిన పనులను, కోరుకొండ, సీతానగరం మండలాలకు చెందిన రైతులకు ముంపు బెడదను శాశ్వతంగా నివారించేలా చేపట్టిన రివర్స్ పంపింగ్ పనులను ప్రస్తుత ఎమ్మెల్యే గాలికొదిలేశారన్నారు. దీంతో గ్రామాల్లోకి వెళ్తే ప్రజలు వీటి గురించి ఎక్కడ నిలదీస్తారో అనే భయంతో తప్పించుకుని తిరుగుతున్నారని అన్నారు. ఒకటో తేదీన ఇచ్చే పింఛన్ల సమయంలో మూడు పార్టీల నాయకులు మూడు సార్లు లబ్ధిదారుల వద్దకు వెళ్లి ఫొటోలు దిగుతున్నారని, అది వారి మధ్య ఉన్న ఐకమత్యమని ఎద్దేవా చేశారు.

ప్రతిభ చాటిన విద్యార్థులకు బహుమతులు



బహుమతులు అందుకున్న విద్యార్థులతో ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయులు

రంగంపేట: ఉత్తమ ప్రతిభ చాటిన విద్యార్థులకు శ్రీఫౌండేషన్ ట్రస్ట్ ఆధ్వర్యంలో శుక్రవారం బహుమతుల ప్రదానం జరిగింది. రంగంపేటలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో 2023–24 విద్యా సంవత్సరానికి సంబంధించి 10వ తరగతిలో మండల స్థాయి ర్యాంకులు సాధించిన విద్యార్థులకు హెచ్ఎం వి.పార్థసారధి అధ్యక్షతన ఈ బహుమతులు అందజేశారు. మండల ప్రథమ స్థానంలో నిలిచిన రంగంపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన బంటు వాసు, ద్వితీయ స్థానం పొందిన జి.దొంతమూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన దుప్పలపూడి రమ్య, తృతీయ స్థానం పొందిన రంగంపేట హైస్కూల్‌కు చెందిన దెయ్యాల హారికలకు 30 గ్రాముల సిల్వర్ మెడల్స్ అందించారు. 6 నుంచి 10వ తరగతి వరకూ ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకూ బహుమతులు అందించారు. ఈ బహుమతులు సమకూర్చిన శ్రీఫౌండేషన్ ట్రస్ట్ ఛైర్మన్ కాళ్ల శ్రీనును పలువురు అభినందించారు. ఉప సర్పంచ్ బలిరెడ్డి దుర్గారావు, విద్యా కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

హిందూ ధర్మం కోసం పనిచేయాలి

సీతానగరం: హిందూ ధర్మం కోసం ప్రతి ఒక్కరూ పనిచేయాలని సమరసత సేవా ఫౌండేషన్ జోన్ కన్వీనర్ బండ్ల రామశంకర్ సూచించారు. శుక్రవారం రఘుదేవపురం శ్రీషిర్డీ సాయిబాబా కల్యాణ మండపంలో సమరసత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో గ్రామ కన్వీనర్లు అభ్యాసవర్గ కార్యక్రమాన్ని నిర్వహించారు. జోన్ కన్వీనర్ రామ శంకర్ మాట్లాడుతూ హిందువులు మత మార్పిడి కాకుండా చూడాలన్నారు. జిల్లా మహిళా కన్వీనర్ గాలి పద్మశ్రీ మాట్లాడుతూ ఇంటింటి ధర్మ ప్రచారం ద్వారా మత మార్పిడులకు అరికట్టవచ్చన్నారు. జిల్లా ధర్మ ప్రచారఖ్ కర్రి శ్రీనివాస్ మాట్లాడుతూ భజనలు, సత్సంగాలు, నగర సంకీర్తనలు, సామూహిక హారతులు ప్రతి ఆలయం ఆధారంగా జరగాలని సూచించారు. సమరసత సేవా ఫౌండేషన్ మండల కన్వీనర్ బూరుగుపల్లి బంగారయ్య, మండల మహిళా కన్వీనర్ కె.అభిలాష, సహ కన్వీనర్లు బొల్లి వేణు గోపాలకృష్ణ, గుల్లి సురేష్‌కుమార్, మహిళా సహ కన్వీనర్ అనంతలక్ష్మి, రాజమహేంద్రవరం నగర ప్రచారక్ అందే మల్లేశ్వరరావు పాల్గొన్నారు.

అధికంగా సభ్యత్వాల నమోదు

రాజానగరం: బీజేపీ చేపట్టిన సభ్యత్వాల నమోదులో జిల్లాలో రాజానగరం నియోజకవర్గంలో అధిక సభ్యత్వాలు నమోదయ్యాయని ఆ పార్టీ ప్రతినిధి అడబాల గణపతిరావు తెలిపారు. ఇందుకు సంబంధించిన క్రియాశీలక సభ్యత్వ నమోదు పుస్తకాన్ని పూర్తి చేసి మండల కన్వీనర్ ఆళ్ల శివనాగరాజు రాజమహేంద్రవరం ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి, బీజేపీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జ్ సిద్ధార్థనాథ్ సింగ్‌లకు శుక్రవారం అందజేసి, వారి నుంచి అభినందనలు అందుకున్నారు.

నేటి నుంచి గ్రామ సభలు

బిక్కవోలు: మండలంలోని భూములు రీసర్వే చేసిన గ్రామాల్లో శనివారం నుంచి గ్రామ సభలు నిర్వహించనున్నట్లు తహసీల్దార్ రమణి తెలిపారు. ఈ సందర్భంగా తహసీల్దార్ 19తేదీన తొస్సిపూడి, 21న తుమ్మలపల్లి, 22న ఇలపల్లి, 23న ఆరికరేవుల, 24న మెళ్లూరు, 25, 26న కొమరిపాలెం, 28, 29న రంగాపురం, నవంబరు 4, 5న పందలపాక, 6, 7న కొంకుదురు, 11, 12న ఊలపల్లి, 13, 14న కాపవరం, 15, 16న బలభద్రపురం, 18, 19న బిక్కవోలులో ఈ సభలు జరుగుతాయన్నారు. రీ సర్వే చేసిన గ్రామాల్లో భూములకు సంబంధించి సమస్యలు ఉంటే గ్రామ సభల్లో రైతులు అర్జీలు సమర్పిస్తే పరిష్కరిస్తామన్నారు.

అర్జీల స్వీకరణ

సీతానగరం: కూనవరంలో రెవెన్యూ గ్రామ సభలు తహసీల్దార్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహించారు. శుక్రవారం కూనవరంలో జరిగిన సభలో ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ పాల్గొని రైతుల నుంచి పలు అర్జీలు స్వీకరించారు. కార్యక్రమంలో రెవిన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

శాస్త్రీయ నృత్యంలో జిల్లా ప్రథమం



భువనప్రియను అభినందిస్తున్న ఉపాధ్యాయులు, పాఠశాల యాజమాన్య కమిటీ ప్రతినిధులు

పెదపూడి: అనపర్తి బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థిని ఎస్.భువనప్రియ జిల్లా సమగ్రశిక్ష ఆధ్వర్యంలో పీఎంశ్రీ పాఠశాలలకు నిర్వహించిన వివిధ పోటీల్లో శాస్త్రీయ నృత్య విభాగంలో ప్రథమ స్థానం సాధించింది. ఆ పాఠశాల హెచ్ఎం కె.కల్యాణి మాట్లాడుతూ రాజమహేంద్రవరంలో బాలికల ఉన్నత పాఠశాల నుంచి వివిధ విభాగాల్లో పోటీలు జరిగాయన్నారు. ఇందులో విద్యా వైభవ్ విభాగంలో 9వ తరగతి చదువుతున్న భువన ప్రియ శాస్త్రీయ నృత్యం చేసిందన్నారు. ఈ మేరకు జిల్లాలోనే ప్రథమ స్థానం సాధించిందని తెలిపారు. జిల్లా ఉప విద్యాశాఖాధికారి నారాయణ, జిల్లా అధికారుల చేతుల మీదుగా ప్రశంసాపత్రం, సర్టిఫికెట్ అందుకుందన్నారు. త్వరలో రాష్ట్ర స్థాయిలో జరిగే పోటీల్లో భువన పాల్గొంటుందన్నారు. భువనతో పాటు సహకరించిన ఉపాధ్యాయులు ఆర్.సరిత, ఎస్.సూర్యనారాయణరెడ్డి, వైబీఎస్, ఆచార్యులను ఉపాధ్యాయులు, ఇతర సిబ్బంది అభినందించారు.

సస్యరక్షణతో అధిక దిగుబడులు

పెదపూడి: ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి వరి పంటలో రైతులు సమగ్ర సస్యరక్షణ, యాజమాన్య చర్యలు చేపడితే అధిక దిగుబడులు సాధించవచ్చని మండల వ్యవసాయ అధికారి టీవీఆర్ మణిదీప్ అన్నారు. పెదపూడి, దోమాడ గ్రామాల్లో ఆయన శుక్రవారం వరి పొలాలను రైతులతో కలసి పరిశీలించారు. ఈ సందర్భంగా మణిదీప్ మాట్లాడుతూ రైతులు వ్యవసాయ అధికారుల సూచనలు, సలహాలు పాటించి సాగు చేస్తే ఎంతో మేలు జరుగుతుందన్నారు. వరిని ఆశించే చీడపీడల నివారణకు అవసరమైన సస్యరక్షణ చర్యలు చేపట్టాలన్నారు. అక్కడక్కడా ఎండాకు తెగులు కనిపిస్తుందన్నారు. దీని నివారణ చర్యలు చేపట్టకపోతే పిలకలు ఎండిపోయి వెన్నులు సరిగా రాకపోవడం లేదా తాలు గింజలు ఏర్పడతాయని తెలిపారు.

భూ సమస్యల పరిష్కారానికి గ్రామ సభలు



పెదపర్తిలో రీ సర్వే గ్రామసభ నిర్వహిస్తున్న అధికారులు

పెదపూడి: గ్రామాల్లో రైతుల భూ సమస్యల పరిష్కారానికి గ్రామ సభలు నిర్వహిస్తున్నామని అనపర్తి తహసీల్దార్ అనిల్‌కుమార్ తెలిపారు. పెదపర్తి గ్రామంలో శుక్రవారం రీసర్వే గ్రామ సభను ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ రైతుల భూ సమస్యలకు పరిష్కారం చూపుతున్నామన్నారు. శనివారం కుతుకులూరు, 21న కొప్పవరం, 22న పొలమూరు, 23న రామవరం, 24న మహేంద్రవాడ, 25, 26న దుప్పలపూడి, 28, 29న పులగుర్త, వచ్చే నెల 4, 5న అనపర్తి గ్రామాల్లో రీ సర్వే గ్రామ సభలు ఉంటాయన్నారు.